# సీతాలు సంసారం

సూర్యోదయమయింది.

అరుణకాంతులు కళ్ళల్లోకి దూసుకు వస్తున్నాయి.

డాక్టరు వినీల యింటిముందర సైకిలుదిగి, తలుపుదగ్గర నిలబడి కరణం గారి మనిషి, మెల్లగా తలుపుతట్టాడు.

ఎవరూ అంటూ తలుపుతీసింది సునీత.

"డాక్టరమ్మను తొందరగా తీసుకురమ్మన్నారు" గడప దగ్గరున్న ఒక మెట్టు దిగాడు.

"బయలుదేరుతున్నామని చెప్పు"

"సునీతా, నిన్న వెళ్ళిన గ్రామానికి వెళ్ళాలి. వాళ్ళ నౌకరుకూడా వచ్చాడు. అవసరమైన వస్తువులు మందులపెట్టె కారులోపెట్టు, గోపీని తలుపులన్నీ వెయ్యమని చెప్పు. అన్నట్టు కారు తుడిచాడా ?" డ్రెస్‌చేసుకుని బైటికివచ్చింది డాక్టరు వినీల.

అప్పటికి సునీత సైకిల్‌మీద వచ్చిన మనిషిని చూడగానే పెట్టెసర్ది కారులో పెట్టింది తలుపు తాళంవెయ్యటానికి సిద్ధంగా నిలబడ్డది.

"గోపీని పిలిచావా ?"

''కారు తుడిచి గేటుదగ్గర నిలబడ్డాడు. మీరు కారులో కూర్చోగానే గేటుకు తాళంవేస్తాడు" అన్నది సునీత.

డాక్టరు కారులో కూర్చోగానే సునీత ఇల్లు తాళంవేసి బైటికి వచ్చింది. గోపీ గేటుకు తాళంవెయ్యగానే ఇద్దరూ కారులోకూర్చున్నారు.

"ఇవాళ నీవు కారునడుపుతావా గోపీ !" అడిగింది డాక్టరు.

"తొందరగా వెళ్లాలంటున్నారు. మీరే నడపండి" అని పక్కన కూర్చు న్నాడు.

అక్కడికి వాళ్ళు వెళ్ళవలసిన గ్రామం పాతికమైళ్ల దూరముంది. స్పీడ్ మీద కారునడిపితేగాని త్వరగా వెళ్ళలేరు.

''ఇది మొదటికాన్పు కనుక ఆలస్యం కావచ్చు. కాని వాళ్ళ ఆదుర్దాకొద్దీ మనిషిని పంపించారు. అయినా నేను బయలుదేరాలనుకుంటునే ఉన్నాను" అంటూ స్పీడ్ పెంచింది డాక్టరు.

"గ్రామాలలో ఉన్నవాళ్ళకు కాస్త నొప్పి మొదలుకాగానే ఒకటే భయం. అందులో డబ్బుగలవాళ్ళకు డాక్టరు, అనుకోగానే ఎదురుగావచ్చి నిలబడాలి. ఆ పురుడు మీరు చెప్పినట్టు ఆలస్యంగావస్తే అంతవరకూ నిలబడాల్సిందే. వట్టిహడా విడి మనుష్యులు" అంది సన్నగా సునీత. చిన్నపిల్లయినా పెద్దమాటలే మాట్లా డింది.

"పురుడు ఎప్పుడైనా రానీ. మనంవెళ్తే వాళ్ళకు కాస్త ధైర్యంగా ఉంటుంది."

సునీత ఏం మాట్లాడలేదు.

పిలవగానే వెళ్ళాలనుకునే డాక్టరు మరొకవిధంగా ఆలోచిస్తోంది. ఆమె కొత్తగా ప్రాక్టీసు పెట్టినప్పటినుంచీ ఎవరుపిలిచినా ఆలస్యం చెయ్యకుండా వెళ్తుంది. ఆమె ప్రాక్టీసు ఆ చుట్టుప్రక్కల గ్రామాలలోనే ఎక్కువ. అక్కడ ప్రాక్టీసుబాగా సాగాలంటే మాటలో నిదానం, ఊరడింపు, పిలవగానే వెళ్ళటం ముఖ్యం. పాత బడుతున్నకొద్దీ, వాళ్ళకూ డాక్టరుమీద నమ్మకమూ, డాక్టరుచూస్తే అన్నిబాధలూ తగ్గిపోతాయన్న ధైర్యమూ కలుగుతుంది. అయినా డాక్టరికి మాటా మంచితనమూ ఓపికా ఎంతో అవసరం. ఆమె జాగ్రత్తగా వాటిని అలవరుచుకోవటం ప్రారం భించింది.

కాని సునీతకు తొందరపాటెక్కువ. డాక్టర్ని అందరూ అట్లా తొందర పెడుతూఉంటే సహించలేదు. "అంత తొందరెందుకు? డాక్టరికి తెలియదా ?'' అనుకుంటుంది. ఒక్కొక్కసారి పైకే అనేస్తుంది.

కారు గ్రామం సమీపిస్తుండగానే గ్రామపెద్ద అయిన నారయ్య డాక్టరు కోసం వాకిట్లోనే నిలబడ్డాడు ఎదురుచూస్తూ.

"చూశావా ఎట్లా ఎదురుచూస్తూ వాకిట్లో నిలబడ్డాడో యజమాని ?" అన్నది డాక్టరు.

కారు ఆగగానే "రండి రండి మీకోసమే ఎదురుచూస్తున్నాను. మనిషిని కూడా పంపాను" అంటూ డాక్టర్ని లోపలికి తీసుకువెళ్ళాడు నారయ్య.

డాక్టరు గదిలో పడుకున్న గర్భిణీస్త్రీని పరీక్షచేసింది.

"ఏమయినా ఆహారం తీసుకున్నారా ?" అని అడిగింది ఆప్యాయంగా.

"ఒకసారి కాఫీ తాగాను, వాంతి అయింది. మళ్ళీతాగాలంటే భయంగా ఉంది."

ఆమె నారయ్యగారి పెద్దకూతురు. మొదటికాన్పుకు పుట్టింటికి వచ్చింది. ఆ గ్రామానికి హెల్తుసెంటర్ గాని చిన్న హాస్పిటల్ గాని లేవు. నారయ్య వాటి కోసం ప్రయత్నాలు చేస్తున్నాడు రెండు సంవత్సరాలనుంచీ. నారయ్యవంటి ధని కులు పట్టణాలనుంచి డాక్టర్లను పిలిపించుకుంటారు. సామాన్యులు ఆ గ్రామంలోని నాటు మంత్రసానితోటే పని గడుపుకుంటున్నారు. కొన్ని కేసులు కష్టమౌతూ ఉంటాయి. డాక్టరు వినీల ఆ గ్రామానికి వచ్చినప్పుడు ఎవరయినా పిలవగానే వెళ్ళి రోగులను చూస్తూ ఉంటుంది. వాళ్ళు ఎంత ఇచ్చినా తీసుకుంటుంది. ఇవ్వలేని వాళ్ళను చూసి "వద్దులెండి" అంటుంది. అందుకే ఆమెకు మంచిపేరు ఆగ్రామంలో వచ్చింది. ప్రతినోటా ఆమె ప్రతిభను గురించే.

"వాంతి అయిందా? చాలా నీరసంగా కనబడుతున్నారు. వాంతులు కాకుండా మాత్ర యిస్తాను. కొంచెం కొంచెంగా తాగండి, ఏం భయంలేదు. సాయంత్రాని కల్లా పాపను చూసుకుంటారు."

"అబ్బా ! సాయంత్రం వరకూ బాధపడుతూ ఉండాలా డాక్టరుగారూ ?" అంది నీరసంగా.

"నేనట్లా అన్నానుగాని ఈలోపలే పురుడురావచ్చు" అంటూ గది బైటికి వచ్చింది.

"డాక్టరుగారూ, ఎప్పుడు కాన్పు అవుతుంది ?" నారయ్య అడిగాడు.

"ఏమండీ డాక్టరమ్మగారూ, అమ్మాయికి ఒక వాంతిఅయింది. రాత్రి నుంచీ నొప్పులు, చాలా హైరానపడుతున్నది. నీరసంతో ముఖం వాడిపోయింది" తల్లి సువర్చల లోపలినుంచి వచ్చింది.

"మీరు ముందు కాఫీ కొంచెం కొంచెంగా ఇవ్వండి. నేను మాత్ర ఇచ్చాను. ఇంక వాంతికాదు. మొదటి కాన్పుకదా, కొంచెం ఆలస్యమవుతుంది. భయం లేదు. ఒక గంటచూసి నొప్పులు బాగారావటానికి ఒక ఇంజషను ఇస్తాను" అంటూ ఆమె కోసం ప్రత్యేకంగావేసిన కుర్చీలో కూర్చుంది. ఆమెకు సమీపంలో మందులపెట్టె దగ్గరపెట్టుకుని కూర్చుంది సునీత వాళ్ళమాటలు వింటూ.

పదకొండుగంటలకు డాక్టరు ఒక ఇంజషను ఇచ్చింది.

"మీరంతా భోజనాలు చెయ్యండి. నేనున్నాగా చూసుకోవటానికి? నారయ్య గారూ వెళ్ళి భోజనం చేసిరండి" అని వాళ్ళను బలవంతగా లోపలికి పంపించింది డాక్టరు.

సునీతకు డాక్టరమ్మ ఓపికకు ఆశ్చర్యం కలుగుతోంది. వాళ్ళ భోజనాల సంగతికూడా ఈమెకే కావాలా? వాళ్ళు ఎప్పుడు భోజనాలుచేస్తే ఈమెకెందుకు?" అనుకుంది చిరాకుపడుతూ.

సుమారు పన్నెండుగంటలకు పురుడు వచ్చింది. బిడ్డ కేర్‌కేర్‌మని ఏడవ గానే ఇంట్లో ఉన్నవాళ్ళ ముఖాలు వికసించాయి. "ఏం పిల్ల" అంటూ అందరూ ఒకసారే అడిగారు.

డాక్టరు బాలింతసంగతి చూస్తూండగా, సునీత బిడ్డకు బొడ్డుకోసింది. మరోమనిషి సహాయంతో నీళ్ళుపోసి పడుకోబెట్టింది. బాలెంతకు పక్కసర్ది పడుకో బెట్టింది. ఆ గదంతా శుభ్రంచేసి సునీత బైటికిరాగానే డాక్టరు ఒకఇంజషనిచ్చి చేతులు కడుక్కుని బైటికి వచ్చింది.

నారయ్య చాలా సంతోషంతో డాక్టర్‌కి ఆమెవెంటవచ్చిన ఇద్దరికీ భోజ నాల ఏర్పాటు చేశాడు.

"మగపిల్లవాడయితే మాకింకా సంతోషంగా ఉండేది డాక్టరుగారూ. మా

యింట్లోనూ మగపిల్లవాడులేడు. అటు అత్తవారింట్లోనూ మా అల్లుడుతప్ప అందరూ ఆడపిల్లలే. మావియ్యపురాలూ అల్లుడూకూడా కొంచెం బాధపడతారు." అన్నాడు నారయ్య.

"ఏ పిల్లపుట్టినా సుఖప్రసవానికి మేముతోడ్పడతాము గాని, మగ ఆడ అంటూ మీకు కావలసినట్లు మేమందించలేముకదా? మా శక్తి ఇంతే. పాప ఏడు పౌండ్లబరువుంది. అవయవాలన్నీ చక్కగా, పనిచేస్తున్నాయి. ఆరోగ్యంగాఉంది. కొందరికి మూడూ, నాలుగూ, ఐదు పౌండ్లే పుడతారు. ఈ పాప అప్పుడేకళ్ళు విప్పిచూస్తున్నది. ఆడపిల్ల మొదటపుడితే మహాలక్ష్మి పుట్టిందంటారు కదా మన వాళ్ళు" అని సర్దిచెప్పబోయింది డాక్టరు.

ఆ యింటి చిన్నా పెద్దా అందరూ "అయ్యో ఆడపిల్లా?" అంటూ పురిటి గది ముందర నిలబడి తొంగిచూశారు.

"ఈ రాత్రికి ఈమెకు కాఫీ మాత్రమే ఇవ్వండి. కావాలంటే ఒకరాత్రివేళ కూడా ఇవ్వండి. రేపు నేను మళ్ళీవచ్చి చూసిన తరువాత భోజనం పెట్టచ్చు. పాపకు తల్లిపాలు ఇప్పించండి" అని సునీతవంక చూసింది డాక్టరు. సునీత పెట్టె పట్టుకుని కారు దగ్గరికి బయలుదేరింది. క్లీనరు గోపి కారు తలుపు తెరిచి పట్టుకుని నిలబడ్డాడు.

నారయ్య దంపతులకు నమస్కరించి డాక్టరు కారులో కూర్చుని స్టార్టు చేసింది.

కారులో కూర్చున్నంతసేపూ సునీత మనసులో కొరకొరలాడుతున్నా పైకి ఒక్క మాటయినా మాట్లాడలేదు. నారయ్యగారింట్లో అందరి ఆదుర్దా, క్షణక్షణానికీ డాక్టర్ని ప్రశ్నలతో విసిగించటం, డాక్టరితో మగపిల్లవాడిని పుట్టించలేదన్నట్టుగా మాట్లాడటం చూసి, లేచి వాళ్ళకు బుద్ధిచెప్పాలన్నంతకోపం వచ్చింది సునీతకు.

"ఈ డాక్టరమ్మ వాళ్ళను చివాట్లుపెట్టకుండా నమస్కారంపెట్టి బయలు దేరింది. వాళ్ళపని పూర్తిఅయిన తరువాత గేటువరకూకూడా వచ్చి సాగనంప లేదు నారయ్య. ఏమిటీ డాక్టరమ్మ? వాళ్ళధోరణికి తొణకకుండా పనిచేసి వచ్చింది?" సునీత మనసులోమండిపోతున్నది.

మరునాటి ఉదయం తొమ్మిదిగంటలకు కారులో ముగ్గురూ బయలు దేరారు. క్రిందటిరోజులా నారయ్య వాకిట్లో నిలబడలేదు. లోపలికి వచ్చిన డాక్టర్ని చూసి లేచివచ్చాడు.

డాక్టరు బాలెంతనుచూసి "పొద్దున కాఫీ తాగారా" అంటూ ఆదరంగా అడిగింది. "పదకొండుగంటలకు భోజనం చెయ్యండి. ఆకలి లేకపోతే బ్రెడ్ కాఫీ తీసుకోండి, మీకు మాత్రలు రాసిస్తాను. తెప్పించి వేసుకోండి" అని పాపను చూసి "బాగాఉంది పాప, బొడ్డుకి బట్ట తగలనీయకండి, పౌడరువేస్తూ ఉండండి" అని బైటికి వచ్చింది.

నారయ్యగారి భార్యతో "ఇకనుంచీ పగలు భోజనం రాత్రిళ్ళు బ్రెడ్, కాఫీ ఇవ్వండి" అని చెప్పింది.

నారయ్య లోపలికివెళ్ళి నూటపదహారు రూపాయలు పెట్టిన కవరు డాక్టరి కిచ్చాడు. సునీతకు పాతిక రూపాయలు చేతిలో పెట్టాడు.

వాళ్ళు గడపదాటిన తరువాత భార్యతో "డాక్టరికి ఆడపిల్ల కనుక నూట పదహార్లే ఇచ్చాను. ఇదే మగపిల్లవాడు పుడితే ఐదువందల వరకూ ఇవ్వాలను కున్నాను" అన్నాడు.

గేటుదగ్గరికి వెళ్తున్నసునీత చెవిన పడ్డాయా మాటలు.

కారు బయలుదేరిన తరువాత మనసులో కుతకుతలాడుతున్న అక్కసును పట్టలేక - "డాక్టరమ్మా, పురుడుపోసినందుకూ మళ్ళీవెళ్ళి చూసినందుకూ ఆయన మీకిచ్చింది ముష్టినూటపదహార్లా? మీరుపడ్డ శ్రమకు ఆయన లెక్కకట్టింది అంతేనా? కాన్పు ఎంతకష్టమయింది? పిల్లబాగా కడుపులో పెరిగింది. నేను పిల్లకుస్నానంచేయించి, తల్లికి పక్కవేసి పడుకోబెట్టి ఆగదంతా శుభ్రంచేస్తే ఆయన బిచ్చంవేసినట్టు ఇచ్చేది పాతికరూపాయలా? మగపిల్లవాడికీ ఆడ పిల్లకూ మనం చేయవలసిన పనులలో కూడా భేదం ఉంటుందా? పైగా మీకు మగపిల్లవాడయితే ఐదువందలు ఇవ్వాలనుకున్నాడట. గేటుదాటుతుండగా నాచెవిన పడ్డాయామాటలు. ఇటువంటివాళ్ళ ఇళ్ళకు వెళ్ళకూడదు డాక్టరమ్మా. మీరెంత మర్యాదగా మాట్లాడారు? వాళ్లెట్లా మాట్లాడేరు? ఛీఛీ" అంది సునీత ముఖం ముడుచుకుంటూ.

డాక్టరు వినీల నవ్వింది.

"సునీతా ! నీకింకా చిన్నతనం. డాక్టర్లు ఎంత ఓర్పుతో నిదానంగా ఉంటే అంత మంచిపేరువస్తుంది. పేరువచ్చిన తరువాత మనదగ్గరికే అందరూవస్తారు. మనం తొందరపడకూడదు."

డాక్టరు మాటలు సునీతకు అంతగా నచ్చలేదు. "పెద్దచదువులు చదివింది గాని ఆలోచనలేదు వెర్రిది అనుకుంది మనసులో.

అలా రోజూ ఏదోఒక గ్రామానికి వెళ్ళటం సునీత చేతిలో పాతికముప్పయి రూపాయలు పడుతూ ఉండటం జరుగుతున్నది. డాక్టరుతోకూడా వెళ్ళేటప్పుడు క్లీనరు గోపీ, ఆమెచేతికింద పనిచేసే సునీత మంచిబట్టలు వేసుకుని తయారయ్యేవారు.

సునీత డాక్టరు చేతికింద పనిచేస్తూ మంత్రసానిపని క్షుణ్ణంగా నేర్చుకుంది. నర్సుగా పనిచేయటానికి తగిన శిక్షణ ఇచ్చింది డాక్టరు. ఇంజక్షన్లు ఇవ్వటం, గాయాలకు పట్టీలు కట్టటం నేర్పింది. క్లీనరుగా ఉన్న గోపి కారునడపటం నేర్చుకున్నాడు.

అసలు సునీత పుట్టినప్పుడు తండ్రికూడా "అయ్యో ఆడపిల్లపుట్టిందే" అని ఆశాభంగం కలిగినవాడే. పేరుపెట్టాలని సీతాలు ఉత్సాహపడుతుంటే "ఏదో పేరుపెట్టచ్చులే" అనేవాడు. సీతాలు తన సంతోషాన్ని పట్టలేక తను పనిచేసే యజమానురాలిని "పాపకేంపేరు పెట్టాలమ్మగారూ ?" అంటూ పాపను చూపించి అడిగింది.

"మీరేమనుకుంటున్నారు ?" అని అడిగిందామె.

"ఆపేరుకోసమే రోజూ తగాదా అమ్మగారూ. ఆడుచెప్పింది నాకునచ్చదు.. "నేనుచెప్పింది ఆడు ఇష్టపడటంలేదు. ఇంతలోకి మూడోనెలవచ్చింది."

"పెద్దవాళ్ళ పేర్లలో ఏదో ఒకటి చూసి పెట్టకూడదూ ?"

"అమ్మో ! అమ్మో ! అళ్ళుబతికే ఉన్నారమ్మగారూ. బతికున్నవాళ్ళ పేర్లు పెట్టరాదంటగా ?"

"అలాగా ? రమణి, రాజ్యం, హారతి, సుమన, సుషమ. నందిని, అమిత, స్వాతి - ఇలాంటివి బాగుంటాయా ?"

"మన అమ్మాయిగారి పేరు ఏంటమ్మగారూ ?" ఆపేర్లు నచ్చనట్టుగా ముఖంపెట్టింది.

"అమ్మాయిపేరు సునీత. నీకునచ్చిందా ?"

"బాగుందమ్మగారూ, మనమ్మాయిగారి పేరుపెట్టుకుని, ఆమె చదివినట్టు పెద్దచదువులు చదవాలనుందమ్మగారూ నామనసులో" అన్నది మురిసిపోతూ సీతాలు.

"అయితే సునీత అనేపెట్టు. మీ యిళ్ళల్లో ఇటువంటి పేరు సాధారణంగా పెట్టరుగా? బాగుంటుంది" అంటూ సీతాలుకూ సలహాయిచ్చింది.సీతాలు బలవంతం మీదనే ఆ పేరుపెట్టాడు గంగులు.

"మగపిల్లవాడయితే మనకింత ఆసరాగా ఉండేది." గంగులు కొంత చూసీ చూడనట్టే ఉండేవాడు.

"ఎట్టా ? అయితే మగోడుకావాలంటే పుడతాడాఏం ? పిల్లనుచూడు బంగారంలా ఉంది. బొద్దుగ ఎదుగుతున్నది. ఆడపిల్లయితే పారేసుకుంటారా ఏం ? ఇంకెప్పుడూ అట్టఅనబోకు" మందలించినట్లుగా అన్నది సీతాలు.

సీతాలు చాలా గారాబంగా చూసేది పిల్లను. గంగులు సంపాదనలో మంచిబట్టలు కుట్టించేది. పిల్ల కొంచెం నలుపయినా పెద్దపెద్ద కళ్ళతో చురుకుగా ఉండేది. నడక మాటలు బాగా వచ్చిన తరువాత గంగులుకూడా దగ్గరికి తీసుకునేవాడు. కూలిపని నుంచి వస్తూ ఒకబిస్కెట్టో చాకొలెట్టో తీసుకువచ్చేవాడు.

సీతాలుకు అమ్మాయిగారిలా సునీతకు చదువు చెప్పించాలని ఉబలాటంగా ఉంది. యజమానురాలిని రోజుకొకసారి అడుగుతూ ఉండేది. "మనమ్మాయిగారు చదివినట్టు మా సునీత చదవాలనుందమ్మగారూ ? అది పెద్దచదువులు చదివి పెద్ద ఉద్యోగం చెయ్యాల.''

"ఇంకోఏడాది పోనీ మనఊళ్లో ఇంతచిన్న పిల్లలకు చదువుచెప్పేబడిలేదు. ఐదోఏడు రానీ అప్పుడు చదివించు బడిలోచేర్పి" అనిఆమె చెప్పగానే రోజులు లెక్కపెడుతూ ఉండేది సీతాలు.

స్కూల్లో చేర్చినప్పుడు కొత్తగౌను కొత్తపలకా బలపం కొన్నాడు గంగులు. రోజూ సీతాలు తనపని తొందరగా చేసుకుని, సునీతను స్కూలుకు తీసుకువెళ్ళి మళ్ళీ తీసుకువచ్చేది అప్పుడు ఒక్కపూటే బడి. మరుసటి సంవత్సరం రెండు పూటలాబడి ఉన్నప్పుడు ఇంటికి తీసుకువచ్చి అన్నంపెట్టి మళ్ళీతీసుకువెళ్ళేది.

సునీత తరువాత సీతాలుకు ఇద్దరు మగపిల్లలు పుట్టారు. ముగ్గురు పిల్లలను చూసుకుంటూ పనిలోకి వెళ్ళటం, ఇంటికివచ్చి ఇంటిపనిచూసుకుంటూ 'వీళ్ళకేంపెట్టాలా' అన్న ఆలోచనలతో సతమతమయ్యేది సీతాలు. తను పనిచేసే ఇంట్లో తనకు పెట్టిన అన్నం కూరలు ఇంటికి తీసుకవచ్చి పిల్లలకు సర్దిపెట్టేది. పిల్లలకు కడుపునిండిందోలేదోనని పరితపించేది.

గంగులు మేస్త్రీ చేతికింద పనిచేసే కూలి మనిషి. కూలీల జీతాలు పెరిగి పెరిగి రోజుకు నలభై రూపాయల వరకు హెచ్చింది. ఇంకా ఎక్కువ చెయ్యమని తాపీపని చేసేవాళ్ళూ కూలీలూ గొడవ మొదలు పెడుతున్నారు.

"ఏమిట్రా గంగులూ, కూలీ ముప్పయి రూపాయలు ఇచ్చినప్పుడూ చాలదని ఏడ్చావు. నలభై చేసినా చాలదంటున్నావు. నీకింత ఖర్చేమిటి? నీకు ఎంతమంది పిల్లలు?" అడిగాడు కాంట్రాక్టరు.

"ముగ్గురండి అయ్యా."

"వాళ్ళ ముగ్గురూ మీరిద్దరూ ఐదుగురు. రోజుకు నలభై రూపాయలు చాలటంలేదా? వచ్చిన దానితో సరిపెట్టుకోవాలి గాని, చాలదు చాలదని గోల పెడతావేం? నీ భార్య ఎక్కడా పనిచెయ్యదా?"

"చేస్తుంది."

"మరి?"

"పిల్లలకు చదువు చెప్పిస్తున్నాం దొరా? బడిలో వేశాము. చదువుకుంటే ఆళ్ళబతుకులయినా బాగుపడతాయని. చదువుకుంటే ఉద్యోగాలు వస్తాయంటకదా. నాలాగ కూలిపని చేయనక్కర్లేదు."

"ఆలోచన బాగానేఉంది. ఎక్కడ చదివిస్తున్నావు ?

"గవర్నమెంటు బడి అండి. ముగ్గుర్నీ అక్కడికే పంపుతున్నామయ్యా."

"ఆ బడికెందుకురా ? అక్షరాలూ అంకెలూ నేర్చుకోవటానికి సూకాలమ్మ గుడిదగ్గర బడిఉంది. ఒకపంతులున్నాడు."

"దాని సంగతి తెలవదండి"

"మంచిపనే చేస్తున్నావుగాని అక్షరాలూ అంకెలూ నేర్చుకోవటానికి ఎంతో మంది పిల్లలు వెళ్తున్నారక్కడికి. ఈ బళ్లో ఫీజులు ముగ్గురు పిల్లలకు నెలనెలకూ కట్టగలవా ? ఆ బడికి వెళ్ళటానికి తగిన బట్టలు కుట్టించగలవా ?"

"ఆ బళ్లో చాలామంది పిల్లలు చదువుతున్నారు-మనపిల్లలు కూడా అక్కడ చదవాలంటుంది మా సీతాలు. మా జీతాలు పిల్లలకే చాలటంలేదయ్యా"

"ఊరికే చెప్పేబడి ఉండగా దాన్నికాదని ఆ బడికిపంపితే నీకెంత కూలీ ఇచ్చినా చాలదు. చెట్టుకింద, పిల్లలకు పగలూ, సాయంత్రం పెద్దలకూ ఆ పంతులు బాగా చెప్తున్నాడు. ఆ బడి మాన్పించి ఇక్కడికి పంపించు ఖర్చు తగ్గుతుంది," మేస్త్రీకూడా అన్నాడు.

గంగులికి నిజమేననిపించింది.

"ఏమే సీతాలూ, డబ్బు తీసుకోకుండా చదువు చెప్పేబడిఉండగా సర్కారు బడి అంటూ ఆ పెద్దబడిలో వేశావు. ఇంక ఆబడి మానిపించు" అన్నాడు ఇంటికి రాగానే.

"ఏమిటీ ఆ చెట్టుకింది బడికా ? నీ వెప్పుడైనా వెళ్ళిచూశావా ? చెట్టుకింద ఊడ్చుకుని నేలమీద కూర్చోవాలి పిల్లలు. ఆ పంతులు ఒక బండమీద కూర్చుంటాడు. పిల్లలకు బల్లలులేవు. పంతులుకి కుర్చీలేదు. అదేంబడి ? అక్కడ చదివితే చదువు వస్తుందా ? ఎవరు చెప్పారయ్యా నీకీమాట ?" సీతాలు విరుచుకు పడింది.

పిల్లలకు బట్టలనీ ఫీజులనీ పుస్తకాలనీ తలకుమించిన ఖర్చవుతున్నది. రోజూ సీతాలు ఏదోఒకటి కొనాలంటుంది. డబ్బు ఇవ్వమంటుంది. గంగులు ఎటూచెప్పలేకపోతున్నాడు. జవాబు చెప్పలేక గుడిసెకు పదిగజాల కవతల రాతి మీద కూర్చుని బీడీ తాగుతూ ఉంటాడు.

పిల్లలు బడినుంచి వచ్చినతరువాత నూకలగంజి తలా గ్లాసెడూ ఇచ్చి, వాళ్ళబట్టలు సబ్బుతో ఉతికి ఆరవేస్తుంది. వాళ్ళు ఆడుకునివచ్చి చదువుకుంటారని, ఒక చింకిచాపపరచి అక్కడొక లాంతరు పెడుతుంది.

రాత్రికి తిండిగింజలు ఒక్కోరోజు ఉండవు. జొన్నగటక చేసి పెడుతుంది. అదీ లేనిరోజున రాగిగటక చేస్తుంది.

అప్పుడప్పుడు తన యజమానురాలిని అడిగి పిల్లలకు సరిపోయే బట్టలు తెస్తుంది.

గంగులు బరువులెత్తి అలిసిపోయి ఇంటికివస్తాడు. ఒకప్పుడు అయ్యో ఆడ పిల్ల అనుకున్నవాడు ఇప్పుడు మగపిల్లలు ఇద్దరుపుట్టినా వాళ్ళను పలకరించటానికి కూడా ఓపిక లేనట్టుంటాడు.

సీతాలు ఒకయింట్లో పనిచేసి ఇంటికివచ్చి పిల్లలపనులు చేసి అలిసిపోయినా, అమ్మగారి పిల్లలు పెరిగినట్టుగా తనపిల్లలు కూడా పెరగాలన్న ఆరాటంతో ఎక్కడలేని బలంతెచ్చుకుని అందరి కడుపులూ నింపటానికి సకల ప్రయత్నాలు చేస్తుంది.

ఓపిక లేకపోయినా ఒకగుడ్డ తలకిందపెట్టుకుని అరుగుమీద నడుంవాల్చి డబ్బు సంగతి-రేపటిమాట ఆలోచిస్తాడు గంగులు.

ఈ ఘర్షణల మధ్య ఆరవ క్లాసులోకి వచ్చింది. మగపిల్లలు గోపీ హనుమంతు మూడు, ఒకటి క్లాసుల్లోకి వచ్చారు. వాళ్ళకు, పుస్తకాలకోసం స్కూలుకు వెళ్ళి టీచర్లకు చెప్పుకుని, పాతపుస్తకాలు ఇప్పించమని సీతాలు కాళ్ళావేళ్ళాపడి సంపాదిస్తుంది. పెన్సిళ్ళూ రబ్బర్లు తెల్లకాగితాలు పుస్తకాలు తనుపనిచేసే ఇంటి నుంచి తెస్తుంది. గుడిసె వెనకాల నాలుగు గజాలమేరలో కొత్తిమేరి పచ్చిమిరప కాయలు పండించి వాటినమ్మి నాలుగైదు రూపాయలపైన చిల్లరడబ్బులు సంపాదిస్తుంది.

కాని-అది ఏ మూలకూ చాలదనితెలుసు. అయినా కృషి మానదు.

"ఏమిటి సీతాలు? నీ ముఖం అట్లా పీక్కుపోయింది? నీ మగాడు తాగటం నేర్చుకున్నాడా ?" అప్పుడప్పుడు యజమానురాలు అడుగుతుంది.

"ఛా ఛా, అట్లాంటోడు కాదమ్మగారూ. ఆడు మంచాడు కనకనే సంసారాన్ని ఎట్లాగో నడుపుకొస్తున్న తల్లీ"

"మరెందుకు నీ బాధ?"

"మీ పిల్లల మాదిరిగా మా పిల్లలుకూడా చదవాలన్న ఆశ అమ్మగారూ. మాశక్తి ఎంతో తెలుసుకోకుండా సర్కారు బడిలోచేర్చాను. ఎక్కడి డబ్బు జీతాలకూ బట్టలకూ సరిపోతున్నది. పిల్లలకు కడుపునిండా కూడు పెట్టలేకపోతున్నా. జొన్నగటక అంబలి మాకు-మీరిచ్చిన అన్నం ఒకపూట పిల్లలకూ సర్దుతాను. అదీ చాలకపోతే ఇన్ని గంజినీళ్ళు పోస్తాను. ఏదయినా మగపిల్లలు సర్దుకుంటారు గాని ఆ సునీత-తనేదో గొప్పోళ్ళ ఇంట పుట్టిననుకుంటుంది. ఏదీ తక్కువయినా అంతలోకి మూతి ముడుస్తుంది. తోసేస్తుంది. మాటిణ్ణి నిజంగా నేనే కష్టపెడుతున్నానమ్మగారూ." కంటతడి పెడుతూఉంటుంది సీతాలు.

"నీవూ, నీ మగాడూ, ఇంతబాగా మాట్లాడటం ఎక్కడ నేర్చుకున్నారు?" అడిగింది ఎన్నాళ్ళనుంచో అడగాలనుకున్న మాటను.

"మేమిక్కడికి రాకముందు- మా లగ్గమయిన తరువాత, ఒకపెద్ద అయ్యగారింటి పనికి కుదిరామమ్మా. ఆ యింటి అమ్మాయిగారు ఒక్కొక్క మాట మళ్ళీమళ్ళీ అనిపించేది. రోజూ మాటమాటకు కోప్పడేది. ఆమెతో ఒకపెద్ద బాధగా ఉండేది మొదట. ఆ తరువాత, అలవాటయింది. వాళ్ళమాటల్లో మామాట కలిసేవరకూ ఊరుకునేదికాదు. ఆ తల్లి ఇంకా కొన్నిరోజులుంటే ఇంకాబాగా మాట్లాడటం వచ్చేది. ఆమె ఇంతకష్టపడ్డా, మాకు కొన్నికొన్ని మాటలు సరిగారాలేదు. ఆ తల్లి రోజూ స్నానంచెయ్యమనేది. తలదువ్వుకొని బొట్టుపెట్టుకోమనేది. ఆమె మొదటి కాన్పుకే చనిపోయిందమ్మగారూ. ఇంకా కొన్నాళ్ళుంటే చదువుచెప్పేది. ఆయమ్మ-ఆ యింటిలక్ష్మి చూస్తుండగానే వెళ్ళిపోయింది. ఆ తరువాత ఆ పెద్ద అయ్యగారూ అమ్మగారూ కూడా కాలంచేశారు. ఆ యింటిపని తీరు-ఆ మాటలు మరువలేం అమ్మగారు. ఆ యింట ఉండబట్టి మా అలవాట్లూ మాటలూ అన్నీ మారిపోయాయి. కాని ఆ యింటినుంచి వచ్చిన తరువాత కొన్నికొన్ని మాటలూ అలవాట్లూ మారిపోయాయి. అప్పటినుంచీ పిల్లలుపుడితే చదివించాలన్న ఆశ. మీ పిల్లలను చూసిన తరువాత ఎక్కువైందిగాని అదొక్కటే బాగా నిలిచింది."

"అట్లా నేర్చుకుని ముందుకుపోవాలి. ప్రతిరోజూ మనం తెలుసుకోవలసిందీ

నేర్చుకోవలసిందీ ఉంటునే ఉంటుంది. సరే ఇదంతా అట్లాఉంచు. నీవు ధైర్యంతో ఆశతో పిల్లలను స్కూల్లో చేర్చావు. అందుకు కష్టపడవలసివస్తుంది. ఇప్పుడు సునీత ఆరోక్లాసులోకి వచ్చిందంటున్నావు. ఏడోక్లాసు అయ్యేవరకూ ఓపికపట్టు. తరువాత ఏదయినా మార్గంచూద్దాం. కష్టపడి సాధించిన ఫలము చాలాగొప్పది. నీకేదయినా కావాలంటే అడిగి తీసుకెళ్ళు. మీ శక్తిఎంతో మీ పిల్లలకు ఏం తెలుసు ? నలుగుర్నీ చూస్తున్నారు కనుక అదీఇదీ కావాలంటారు. మంచి మాట లతో నచ్చచెప్పాలి. నీయింటి సంగతులు కూడా వాళ్ళకు తెలియాలి."

కన్నీళ్ళు తుడుచుకుని ఆమె ఇచ్చిన నూకలూ పక్కకొంగులో పోసుకుని ఇంటికివచ్చింది.

సీతాలు ఇంటికి వచ్చేసరికి గంగులు చింకిచాప గుడిసెముందర వేసుకుని కాలు పైకెత్తిపట్టుకుని తలవంచుకుని మూలుగుతున్నాడు.

సీతాలుకు గుండెలవిసిపోయాయి.

"ఏమయిందయ్యా కాలికి ?" అతడి పక్కనకూర్చుని కాలు పట్టుకు చూసింది.

"ముట్టుకోకే ప్రాణంపోతోంది" కాలు ఎత్తిపట్టుకుని తల అరుగుకానించాడు కళ్ళు మూసుకుని.

"కాలిమీద ఏంపడింది ? రాయిగాని పడిందా ?"

"అవును బునాది రాయి పాదంమీదపడి చితికిపోయింది. ఇద్దరు కూలీలు మోసుకువచ్చారు"

'అయ్యోదేవుడా ! మూలిగే నక్కమీద తాటికాయ పడ్డట్టయింది. నీవిక్కడే ఉండు. అమ్మగారినడిగి మందుతెస్తా" పరుగుతీసింది.

"అస్పత్రికి తీసుకెళ్ళవే. వాళ్ళు మందువేస్తారు" అని ఆమె రిక్షాకు డబ్బు లిచ్చింది.

గంగులు సీతాలు వెళ్ళేసరికి అక్కడున్న డాక్టరు పట్టీకట్టి మరునాడు రమ్మన్నాడు ఎక్సురే తీసిచూడటానికి. అప్పటికి ఎనిమిది రూపాయలయింది ఇల్లు చేరుకువేసరికి.

మరునాడు వెళ్ళటానికి డబ్బుకావాలి.

ఆ రాత్రికి గంగులికి పిల్లలతోపాటు నూకలన్నం వండి పెట్టింది. తను అంబలి చేసుకుంది. గంగులు తెల్లవార్లూ కాలు ఎత్తి పెట్టుకుని మూలుగుతునే ఉన్నాడు.

తెల్లవారకముందే యజమానురాలి దగ్గరకెళ్ళి తన జీతం ఎడ్వాన్సుగా తీసుకువచ్చింది. ఇంట్లో ఉన్నదేదో వండి పిల్లలకూ గంగులికి పెట్టింది. అమ్మగారిచ్చిన రొట్టె ముక్కతో కడుపునింపుకుని ఆస్పత్రికి రిక్షామీద తీసుకు వెళ్ళింది గంగులిని.

ఎక్సురే తీసిన డాక్టరు పాదములో ఉన్న ఎముకలు చితికి పోయాయన్నాడు. పాదానికీ మడమకూ పైన బెత్తెడు పైకి ప్లాస్టరు వేశారు. నొప్పి తగ్గటానికి మాత్రలిచ్చారు. అక్కడ ఉండటానికి పడకలులేవు. ఇరవై రోజులయిన తరువాత మళ్ళీ రమ్మన్నారు.

మళ్ళీ తిండికి మందులకూ తల పగలగొట్టుకోవలసి వచ్చింది సీతాలుకు.

గంగులికి రావాలసిన కూలీ డబ్బులు కాంట్రాక్టరు ఇస్తాడేమోనని వెళ్ళింది. "శనివారం కూలీలకు డబ్బులిచ్చేరోజు. రెండురోజుల తరువాత వచ్చి తీసుకెళ్ళు" అన్నాడు.

సీతాలు గుండెలు బాదుకుంటూ ఇంటికి వచ్చింది.

రెండు రోజులు గడపాలి, కుండలన్నీ బోర్ల వేస్తే ఒక రోజుకు సరిపడా జొన్నలు రాలాయి. రాగులు అరకిలో వరకు తేలాయి. నూకలు పిల్లలకు ఒక పూటకు సరిపోతాయి.

పిల్లలకు గంగులికి పెట్టి పనిలోకి వెళ్ళింది. యజమానురాలిచ్చిన రెండు రొట్టెలుతిని పన్నెండు గంటలకు వచ్చింది.

సునీతకు ఆరోక్లాసు పరీక్షలయ్యాయి. మగపిల్లలిద్దరూ చిన్న క్లాసు పరీక్షలు రాశారు. సెలవుల్లో మగపిల్లలిద్దరినీ ఇనప దుకాణాలలో చిన్న చిన్న పనులకు పెట్టింది. సునీతను ఇంట్లోఉంచి, నూకలన్నం సంకటి అంబలి కాచిపెట్టి, మేస్త్రీ దగ్గరికి వెళ్ళింది. ఆ వారం కూలీలో మూడు రోజులు పట్టుకుని ఇచ్చాడు.

గంగులు పనిలోకి రాలేదని తనకు కూలిపని ఇప్పించమని అడిగింది. సీతాలు యజమానురాలికి చెప్పి, మరుసటి రోజునుంచి కూలిపనికి వెళ్ళటం మొదలు పెట్టింది. తనకు కూలి ఇచ్చే వరకూ మగపిల్లలు తెచ్చిన డబ్బుతో కడుపులు నిండేటట్టు సర్దుబాటు చేసింది.

పన్నెండు పదమూడేళ్ళు వచ్చిన సునీత మనసులో ఇంటి గురించిన విషయాలు అనేకంగా ఘర్షణపడనారంభించాయి. తండ్రికాలు బాగుపడినా ఇది వరకూ మాదిరిగా కూలిపనిచేసి రోజుకు నలభయిరూపాయలు తేగలడా ? ఒకపూట గటక, ఒకపూట నూకలన్నం, ఒకపూట గంజితో ఎంతకాలం ఇట్లా బతకాలి ? ఇంతవరకూ తనకు నచ్చినబట్టలు తల్లి కొనలేక పోతున్నది. అక్కడా అక్కడా అడిగి తెచ్చిన బట్టలూ ఏడాదికొకసారి కుట్టించుకునే ఒకజత కొత్త బట్టలతో కాలం గడుపుతున్నది తల్లి.

ఇదీ ఒక బతుకేనా?

ఆమెకా గుడిసె, దానిలో బోర్లించిన కుండలూ దాకలూ చూడబుద్ధి కావటంలేదు. తల్లీ తండ్రీ చిరుగుల బట్టలతో వెన్నుకంటుకు పోయినకడుపులతో తిరుగుతుంటే సిగ్గుగా ఉంది.

గుడిసెకవతల మురుగు కాలవలూ దోమలూ వాసన భరించరానివిగా ఉన్నాయి.

ఏంచెయ్యాలి?

ఆ వయసులో అప్పటికి అంతా అయోమయంగా ఉందామెకు.

తండ్రికి ఆసుపత్రిలో పాదానికి మళ్ళీ ఎక్సరే తీశారు. ఎముకలు అతుక్కున్నాయి కాని అతడు బరువు పనులు చేయకూడదన్నారు డాక్టర్లు. తేలిక పనులు చేసుకోమన్నారు.

కాని తేలికపనులు చేస్తే ఎంతడబ్బు వస్తుంది? ఆ మేస్త్రీనే కాళ్ళు పట్టుకున్నాడు. చాలా రోజులనుంచీ ఉన్నాడు, కనుక మేస్త్రీ దయ తలచాడు కాని వెనుకటి కూలీ ఇవ్వలేనన్నాడు.

అయినా గంగులు గబగబా నడవలేక పోతున్నాడు. ఒక్కొక్క రోజు పాదం నొప్పిపెట్టి రాత్రిళ్ళు నిద్రపోనివ్వదు.

సునీత పెద్ద తమ్ముడు గోపీ గుణాలలో అక్కను పోలినవాడే కాని చదువులో కాదు. చదువుమీద ధ్యాస తక్కువ, ఎప్పుడూ అత్తెసరు మార్కులతో నెట్టుకు రావటమేగాని కష్టపడి చదువుదామనుకోడు మంచి బట్టలూ కాళ్ళకు మెరిసే బూట్లనూ వేసుకునే వాళ్ళను, చూపులు మరల్చకుండా చూసి నిస్పృహ చెందేవాడు.

సునీత ఏడవక్లాసు మంచి మార్కులతో విజయం పొందాలని కష్టపడి చదువుతున్నది. తమ్ముళ్ళను ఎన్నడో ఒకనాడు "బాగా చదువుకోండి-కనీసం ఏడవ తరగతయినా పూర్తి చెయ్యండి" అని మందలిస్తుంది.

ఆ స్కూలుకు సంవత్సరానికొక్కసారి పిల్లల ఆరోగ్యాన్ని పరీక్షచేయటానికి ఒక డాక్టర్ని పిలిపిస్తారు. ఏదయినా జబ్బు కనుపిస్తే దానికి మందులు రాసిస్తారు. క్షయ వంటి సూచనలు కనబడినప్పుడు, ఆస్పత్రిలో చూపించమని తల్లిదండ్రులకు ఒక చీటీమీద రాసి ఇస్తారు.

ఆ సంవత్సరము ఒక లేడీ డాక్టరు పిల్లలను వైద్య పరీక్ష చేయటానికి వచ్చింది ఆమె అన్ని క్లాసులలోని పిల్లలనూ పరీక్ష చేయటానికి ఒక రోజంతా పట్టింది.

సాయంత్రం నాలుగు గంటలు కాగానే స్కూలు హెడ్‌మాస్టరు ఆమెకు తనగదిలో కాఫీ టిఫిన్ ఏర్పాటు చేశాడు. తోటి క్లాసుటీచర్లందరూ ఆమెతోపాటు అక్కడే టిఫిన్లు తీసుకుంటున్నారు.

బడి పిల్లలందరూ ఇళ్ళకు వెళ్ళారు. కాని సునీత గేటుకు దగ్గరగా నిలబడ్డది.

డాక్టర్ని సాగనంపటానికి ఉపాధ్యాయవర్గమంతా కారు వరకూ వచ్చారు. కారుకు అవతలివైపున ఉపాధ్యాయుల కంటబడకుండా సునీత కారు తలుపు దగ్గర నిలబడి డాక్టరికి దణ్ణం పెట్టింది.

డాక్టరు ఆశ్చర్యంతో "నీవు ఈ స్కూల్లో చదివే విద్యార్థినివా?" అడిగింది.

"అవునమ్మా, నేను ఏడవక్లాసు ప్యాసయితే నాకేమయినా ఉద్యోగం దొరుకుతుందా?"

"పదవక్లాసు ప్యాసయితే నర్సుగా శిక్షణ పొంది హాస్పిటల్లోగాని విడిగా డాక్టర్ల దగ్గరగాని నర్సింగ్‌హోముల్లో గాని పనిచేయవచ్చు. ఏడవక్లాసే అయితే మంత్రసాని శిక్షణ పొంది గ్రామాలలో పనిచేయవచ్చు. ఇవి కాక టీచరుగా పని చేయలంటే ఉపాధ్యాయ శిక్షణ ఒక సంవత్సరం పొందితే గవర్నమెంటు స్కూళ్ళల్లో గాని ప్రైవేటు స్కూళ్ళలోగాని చెయ్యవచ్చు. అయినా నీ కెందుకంత తొందర?" అన్నది.

"నాకు తొందరగానే ఉందమ్మా, మీ అడ్రసు ఇవ్వండి. నేనూ నా కష్టాలన్నీ ఉత్తరంలో రాస్తా"నంది సునీత గద్గదస్వరంతో.

డాక్టరికి జాలికలిగింది అమ్మాయిని చూడగానే తనతో మాట్లాడటానికి ధైర్యంతో కారు దగ్గరికి వచ్చినందుకు ఆశ్చర్యమేసింది. వెంటనే తన ఎడ్రసు గల కార్డు ఇచ్చింది.

సునీత ఆమెకు ఒంగి దణ్ణంపెట్టింది. ఉపాధ్యాయవర్గము చేతులు జోడించగానే కారు బయలుదేరింది.

ఆ మరునాడే సునీత డాక్టరు ఉంటున్న ఊరికి ఉత్తరం రాసింది. దానిలో తన తల్లిదండ్రుల పేదరికం, తమ చదువులకు ఎంతో కష్టపడి ఫీజులు కట్టి, బట్టలు కుట్టించటం, తండ్రికి కాలికి దెబ్బ తగిలి కూలి తగ్గిపోవడం తన తల్లి కష్టాలూ వివరంగా రాసింది. తనకొక చిన్న ఉద్యోగం ఏలాగయినా ఇప్పించమని మరీ మరీ ప్రార్థించింది.

డాక్టరు ఓపికతో అమ్మాయికి ఉత్తరం రాసింది.

అమ్మాయీ !

నీవు నీ యింటి పరిస్థితులు బాగాలేవని ఏ చిన్న ఉద్యోగమయినా కావా లంటున్నావు. ఇంత చిన్నతనంలో నీకీబుద్ధి పుట్టటం గొప్ప విషయం. నీ కాళ్ళ మీద నీవు నిలబడాలనుకోవటం మంచిదే. పదవక్లాసు ప్యాసయి నర్సుగా శిక్షణ పొందితే నీ భవిష్యత్తు బాగుంటుందని నా అభిప్రాయం- అంతవరకూ ఆగితే

ఈలోపల మీ పరిస్థితులు మెరుగవుతాయేమో ఆలోచించు. కష్టదశలో కన్నవారి మనసు నొచ్చుకునేలా నీవు రావటం మంచిదికాదేమో!

మరీ అంతగా రావాలనుకుంటే రా. నాకు కారుంది గ్రామాలకు కూడా వెళ్ళి వైద్యము చేస్తూ ఉంటాను. చేతికిందికి ఒక మనిషి కావాలి. నా కారుక్లీనరు వెళ్ళిపోయాడు. నాకు అర్జంటుగా ఒక క్లీనరు అవసరం. మీ తమ్ముడు కూడా వస్తానంటే తీసుకురా. ముందు ఈ పనులు చేస్తూ ఉంటే భవిష్యత్తులో మంచి అవకాశాలు రావచ్చు."

సునీత ఉత్తరానికి జవాబురాసి పోస్టులో పడేసింది.

పరీక్షా ఫలితాలు తెలిసిన వెంటనే బయలుదేరాలని తమ్ముడితో ఆలోచనలూ సలిపింది.

అయితే ప్రయాణానికి ఖర్చులు కావాలి. పాతిక రూపాయలైన చేతిలో ఉండాలి. ఏ చిన్న పనైనా చేసి డబ్బు సంపాదించాలన్న ఆరాటంతో తమ్ముడిని తీసుకుని ఊరంతా తిరిగింది. ఇనపసామాన్ల దుకాణంలో కొలిమితిత్తి ఊదేపని చేస్తే రోజుకు పదిరూపాయలిస్తారు. కాని, చిన్న పిల్లవాడు కనుక ఆరే రూపాయలిస్తామన్నారు. కొంతయినా నయమేనని తమ్ముడిని ఒప్పించి ఆ పనిలో పెట్టింది. తను ఒక టైలరు దగ్గర చేతికింద పనిచేయటానికి రోజుకు నాలుగు రూపాయలకు ఒప్పుకుంది.

పరీక్షా ఫలితాలు తెలిసిన మరునాడు-తండ్రికి మందుతీసుకురావటానికి తల్లి అప్పుకు బయలుదేరగానే ఇద్దరూ బయలుదేరి వెళ్ళిపోయారు బస్సులో. డాక్టరు ఇల్లు వెతుక్కుంటూ వెళ్ళారు. వీళ్ళు వెళ్ళిన సమయానికి డాక్టరు బైటికి వెళ్ళింది. ఆమె వచ్చేవరకూ వాకిట్లో కూర్చున్నారు.

"తల్లికి మందు తీసుకురావటానికి డబ్బు దొరకలేదేమో? తల్లికి కూలి రాలేదు. ఏంచేస్తున్నదో?" నని ఒకక్షణమనిపించింది సునీతకు.

అంతలోనే మరొక ఆలోచన దాన్ని తరుముకుంటూవచ్చింది.

"అది నిత్యదారిద్ర్యపుకొంప. ఇప్పటికి తమ దగ్గరిది కొంతయిచ్చినా మళ్ళీ ఏదోఒకటి అవసరమవుతునేఉంటుంది. ఆ యింటిని ఎవరూ బాగుచెయ్యలేరు"

డాక్టరు రాగానే ఆమె కాళ్ళకు ఇద్దరు దణ్ణాలుపెట్టారు.

ఆ మరునాటినుంచీ సునీత డాక్టరు యింట్లో వంటయింట పనులుచేసి ఆమెతోకూడా గ్రామాలుతిరగటం-ఆమె తమ్ముడు గోపీ కారుతుడవటం తోటపని చేయటం ఇంటికి కాపలాఉండటం, చెప్పినపనల్లాచేయటం నేర్చుకున్నాడు. వాళ్ళకు భోజనం డాక్టరు ఇంట్లోనే జరిగిపోయేది. పెరటివైపున ఉన్నగది వాళ్ళిద్దరికీ ఇచ్చింది. హాయిగా కాలంగడుపుతున్నారు.

రాత్రి పడుకోబోయేటప్పుడు ఇద్దరికీ ఇంటినిగురించిన ఆలోచనలువచ్చేవి.

"ఓరే గోపీ, మనమా మురికికూపంలోనుంచి బైటపడి సుఖంగా డాక్టరమ్మ దగ్గరచేరుకున్నాం. కొద్దిగానయినా డబ్బు సంపాదించుకుంటున్నాము. ఇంకా మనం హనుమంతునిగురించీ అమ్మా- నాన్నలనుగురించి ఆలోచిస్తూ కూర్చుంటే ఆమురికికూపంలోనుంచి బైటపడేవాళ్ళంకాదు" సునీతఅంటే 'అవునక్క' అనే వాడు గోపి. కాని మనసులో అమ్మనుగురించిన దిగులుఉండేది. మరిచిపోవటానికి ప్రయత్నించేవాడు.

నాలుగైదు నెలలయ్యేసరికి వాళ్ళిద్దరూ ఊరినుంచితెచ్చిన కూలిడబ్బులు కాక డాక్టరమ్మ ఇంటికివచ్చినతరువాత కూడబెట్టుకున్నడబ్బుతో గోపీ రెండు డ్రెస్సులు కొనుకున్నాడు సునీత రెండుచీరెలు జాకెట్లుఅమర్చుకుంది. డాక్టరమ్మ కూడా తనవి పాతబడిన చీరెలుఇచ్చేది.

రెండుసంవత్సరాలు గడవగానే "నేను విదేశాలకు వెళ్ళటానికి ప్రయత్నిస్తున్నాను. మీరేంచేస్తారు?" అడిగింది డాక్టరు.

ఇద్దరు నిర్జీవంగా గోడకానుకుని నిలబడిపోయారు.

వాళ్ళనుచూస్తే ఆమెకు జాలేసింది.

"చెప్పండి ఏంచేస్తారు?"

"మీరే చెప్పండమ్మా మేమెట్లాబతకాలో? మీచాటున బతికినవాళ్ళంకదా ఇన్నాళ్ళూ" ఏడ్చారు ఇద్దరూ.

"నేను వెళ్ళటానికి ఎట్లాగయినా నాలుగయిదు నెలలు పడుతుంది. నీకు చాలావరకూ మంత్రసానిపని నేర్పించాను. ఈ నాలుగునెలల్లో నీవు ఇంకా బాగా

నేర్చుకో. తెల్లటిబట్టలు గంజిపెట్టిన చీరె జాకెట్టు వేసుకో. నర్సులా కనబడాలి. గ్రామాలలోకిపోయి మంత్రసానిపని చేసుకో. మీ యిద్దరిదగ్గరున్న డబ్బుపెట్టి ఒక ఆటో కొనుక్కోండి. బండిచాకిరీ కూడా వాళ్ళనడగండి. సంపాదించినడబ్బు చెరిసగం తీసుకుని బతకండి" వాళ్ళముఖాలుచూస్తూ నిలబడ్డది డాక్టరు.

"మీరు మళ్ళీవస్తారా?" అడిగింది సునీత.

"ఆఁ నేను రెండేళ్ళకోసం వెళుతున్నాను. మళ్ళీ ఇక్కడికేవస్తాను. ఇది నా స్వంతఇల్లు"

గుండెభారం కొంచెం తగ్గినట్లయింది సునీతకు.

"అమ్మా, మేమా గదిలోనేఉండి మీ యింటికి కాపలాకాస్తాము. మీ తోట ఇల్లు మీరున్నట్టుగానే ఉంటాయి" అని కాళ్ళమీదపడ్డది.

డాక్టరు కొంచెం మెత్తబడ్డది. అయినా చిన్నవాళ్ళమీద ఇల్లువదలి పెట్ట బుద్ధికాలేదు.

"ఒకరికి ఇల్లు అద్దెకిస్తాను. ఆ గదిలోనే మీరుండి తోటచూస్తూ ఇంటికి కాపలాగా ఉండండి"

డాక్టరు వెళ్ళేముందర అందరికీ సునీతను పరిచయంచేసింది. మంత్రసానుల ట్రైనింగ్ సెంటర్‌నుంచి అక్కడ ట్రైనింగయినట్లుగా సర్టిఫికెటుతెప్పించి యిచ్చింది. తన కారు అమ్మింది. అన్ని జాగ్రత్తలూచెప్పి వెళ్ళింది.

సీతాలూ గంగులూ పిల్లలు ఎక్కడికో రెండుపూటలూ అన్నంతినటానికీ శుభ్రమైనబట్టలు కట్టుకోవటానికే ఇంటినుంచి వెళ్ళిపోయారని గ్రహించుకున్నారు. తమ అశక్తతకు తమనుతామే నిందించుకున్నారు. చేతనయినంతవరకూ వెతికారు వెతికించారు.

రెండవకొడుకు హనుమంతుకు దర్జాబతుకుమీద భ్రమలేదు. తండ్రితో కూడావెళ్ళి చిన్నచిన్నపనులు చేసేవాడు. ఏది ఇచ్చినా తండ్రికి తినిపించి తాను తినేవాడు. ఒక ఏడాదిసాగింది కాని గంగులు మరీ నీరసించిపోయాడు. అతడిని గుడిసెలోనేఉంచి సీతాలు కూలిపనికివెళ్ళేది. హనుమంతు స్కూలుకు మళ్ళీ వెళ్ళటం మొదలుపెట్టాడు.

కాలం కొందరికి క్షణాలు గడిచినట్టుగా గడుస్తుంది. కొందరికి సంవత్సరాలుగడిచినట్టు రోజులు గడుస్తాయి.

ఇప్పుడు ముగ్గురూ కడుపునిండా భోజనం చేస్తున్నారు. ఒంటినిండాబట్టలు కట్టుకుంటున్నారు. సీతాలు మామూలుగా తను ఎప్పుడు పనిచేసే ఇంట్లోనే పని చేసుకుని అక్కడే భోజనంచేసివస్తుంది కొడుకువద్దన్నా వినదు.

హఠాత్తుగా ఒకనాడు ఏభయిరూపాయల మనియార్డరు వచ్చింది.

"ఏమయ్యా చూస్తున్నావా? నీ కూతురూ కొడుకూ పంపించారయ్యా. ఏభయిరూపాయలు! ఏదో ఊరంట. వాళ్ళు సుఖంగాఉండి నీకు ఏభయి పంపించారు" అని.

కాని, గంగులు "మనను వదిలిపెట్టి వెళ్ళినవాళ్ళడబ్బు మనకెందుకే? అవి లేకపోయినా బతుకుతున్నామా లేదా?" అన్నాడు.

గంగులికి పొద్దేగడవటంలేదు. కాని హనుమంతుకు రెండు క్లాసులనుంచి నాలుగవక్లాసులోకి డబుల్ ప్రమోషనువచ్చింది. తరువాత వరసగా పరీక్షలు బాగా చదివి నెట్టుకువస్తున్నాడు. అతడికి పేదవాళ్ళకిచ్చే స్కాలర్‌షిప్పు ఇప్పించమని సీతాలు పనిచేస్తున్న యజమానురాలిని ప్రతిమిలాడింది. ఆమె తన పెనిమిటిచేత చెప్పించి సహాయం చేయించింది. కాని తమ యిద్దరికష్టాలూ ఆ విధంగానే సాగుతున్నాయి. వాళ్ళిద్దరిదృష్టి పిల్లవాడి చదువుమీదనేఉంది. పదవక్లాసు అయితే ఏదయినా ఉద్యోగమిప్పించమని తమ యజమానురాలినే అడగాలని.

మనసుకున్న వేగం కాలానికిఉన్నదా? దాని గతిన అదినడుస్తుంది. హనుమంతు ఒక్కొక్కక్లాసే నెట్టుకువస్తుంటే-ముగ్గురూ కడుపునిండా అన్నంతిని ఒంటినిండా బట్టకట్టుకుంటున్నారనుకుంటే గంగులికి మూడురోజుల జ్వరంతో వాళ్ళ భవిష్యత్తు మారిపోయింది. గంగులు మళ్ళీ జబ్బుపడ్డాడు.

తరువాత రెండుసంవత్సరాలకుగాని హనుమంతు పదవక్లాసు పాసుకాలేదు. "మీరేదిక్కమ్మా! పిల్లవాడికి ఏదయినా దారిచూపించమని సీతాలు యజమానురాలిని ప్రతిమిలాడగా ఆమె భర్త ఆఫీసులో అటెండరుగా నియమించాడు. అతడు ఆ మరుసటి సంవత్సరం దరఖాస్తుపెట్టించి ప్రభుత్వంవారు కట్టించిన ఇంటిని ఒకదాన్ని యిప్పించాడు.

తల్లి చెప్పినట్టుగా తనకు ప్రతి విషయంలోనూ తమకు సహాయంచేసి పైకి తీసుకువచ్చిన యజమానులకు నూతనవస్త్రాలు సమర్పించి వాళ్ళ పాదాలకు నమస్కరించాడు. మరునటి నెలలో తల్లిదండ్రులకు బట్టలుపెట్టి నమస్కరించాడు. చిన్నచిన్న ఋణాలు తమయింటి ఖర్చులకు చేసినవి నెలకొకటి వంతున తీర్చివేస్తున్నాడు.

కన్న సంతానములో ఒక్కడైనా అభివృద్ధిలోకివచ్చి ప్రయోజకుడైనాడని మంచంలోఉంటూకూడా హనుమంతుని చూసి సంతోషిస్తాడు. సీతాలు హనుమంతుకు ఒక మంచి కుటుంబములోనుంచి ఒక అమ్మాయిని తీసుకువచ్చి వివాహం చేసింది.

''చూడవయ్యా చూడు, వాళ్ళు ఎక్కడో బాగానే ఉండే ఉంటారు. వీడు మనతోఉండి, కష్టాలన్నీ భరిస్తూ ప్రయోజకుడైనాడు. పెళ్ళికూడా అయింది. ఇంక మన కేం హాయిగాఉండచ్చు'' అంటుంది. ఆ యువజంటనుచూసి మురుస్తూ గంగులికి చెప్తుంది. కాని-తనకింత సహాయముచేసిన యజమానురాలినిమాత్రం మరువకుండా రోజూ పనికివెళ్ళుతుంది. ఆమె పెట్టిందితిని మిగిలినది ఇంటికి తీసుకువచ్చి గంగులికి కూడా పెడుతుంది. కొడుకు వద్దన్నా వాళ్ళయింటి పని మానదు.